ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి బనకచర్లకు గోదావరి జలాలు తెస్తామని ప్రభుత్వం అంటోంది. రూ.80 వేల కోట్లతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. ఎక్కడి నుంచో కరువు సీమకు నీళ్లు ఇస్తా అనడం సరే.. హక్కుగా కృష్ణా నది నుంచి రావాల్సిన నీరు ముందు ఇవ్వాలి. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా జీవనాడి గుండ్రేవుల ప్రాజెక్టును ప్రథమ ప్రాధాన్యతగా చేపట్టాలి. హంద్రీ నీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల చేసేందుకు నేడు ఉమ్మడి కర్నూలు జిల్లాకు వస్తున్న సీఎం చంద్రబాబు దృష్టికి గుండ్రేవుల ప్రాజెక్టు అవసరాన్ని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు తీసుకువెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.


తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రదేశం

గుండ్రేవుల పూర్తి చేస్తారా..?

- కరువు, వలసలు నివారించే బృహత్తర ప్రాజెక్టు
- 2019లో రూ.1,985 కోట్లు మంజూరు చేసిన టీడీపీ ప్రభుత్వం
- వైసీపీ హయాంలో ఐదేళ్లు నిర్లక్ష్యం
- వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్‌ను ఓకే చేసిన ప్రస్తుత ప్రభుత్వం
- నేడు హంద్రీ- నీవాకు కృష్ణా జలాలు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు

కర్నూలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-కడప (కేసీ) కాలువ పరిధిలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో 2,65,628 ఎకరాల ఆయకట్టు ఉంది. 31.90 టీఎంసీలు నికర జలాలు కేటాయింపు ఉన్నా నిల్వ చేసుకునే జలాశయం లేదు. తుంగభద్ర డ్యాం నుంచి 10 టీఎంసీలు, సుంకేసుల బ్యారేజీ నుంచి తుంగభద్ర ప్రవాహం ద్వారా 21.90 టీఎంసీలు మళ్లించాలి. ఈ బ్యారేజీ సామర్థ్యం కేవలం 1.20 టీఎంసీలే. తుంగభద్రకు వరద రోజులు తగ్గడం, టీబీ డ్యాం నుంచి ఇచ్చే వాటా జలాలు నదిలో దాదాపు 350 కిలోమీటర్లు ప్రవహించి సుంకేసుల బ్యారేజీకి 25 శాతం కూడా చేరడం లేదు. దీంతో కేసీ కాలువ చివరి ఆయకట్టు, కర్నూలు నగరానికి సాగు, తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ కష్టాలకు చెక్ పెట్టి.. కష్టజీవుల కన్నీళ్లు తుడవాలంటే సుంకేసుల ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణమే ఏకైక మార్గమని సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు గుండ్రేవుల ప్రాజెక్టుకు డిజైన్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు గురించి ఎన్నికల ముందు పట్టించుకుంది. 2019 ఫిబ్రవరి 21న ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కోరిక మేరకు రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్‌టీ నం.154 జారీ చేసింది. అప్పటి కల్లా పుణ్యకాలం ముగిసి ఎన్నికలు రావడం, టీడీపీ ఓడిపోవడం, జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడం వెంట వెంటనే జరిగాయి. వైసీపీ ప్రభుత్వం గుండ్రేవులను పట్టించుకోలేదు. అంతర్ రాష్ట్ర సమస్య అంటూ అటకెక్కించింది. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో గుండ్రేవులపై ఆశలు చిగురించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేఆర్ఎంబీ సహా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు పంపించారు. 35 టీఎంసీలకు పెంచి, అందులో 15 టీఎంసీలు ఆర్డీఎస్ ఎడమ కాలువ ఆయకట్టుకు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలుస్తున్నది. అంటే ఇప్పుడు గుండ్రేవులకు ఏ ఆటంకం లేనట్లే. మరి పదవీ కాలం ఆరంభం నుంచే ఈ ప్రాజెక్టు మీద కేంద్రీకరిస్తే ఉమ్మడి జిల్లా ప్రజల కలలు నెరవేరుతాయి. మరి ఆ దిశగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి సహా ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబును ఒప్పించగలరా?


అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

మిగతా 6వ పేజీలో

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీరు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి
- మల్యాల ఎత్తిపోతల వద్ద జలహారతి

నందికొట్కూరు, నందికొట్కూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవా సుజల స్రవంతి కాలువకు నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరు విడుదల చేయనున్నారు. సీఎం పర్యటనకు మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి బుధవారం రాత్రిలోగా 36 గంటల్లో టీడీపీ నాయకుడు మాండ్ర శివానంద రెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా పర్యవేక్షణలో అధికారులు పూర్తి చేశారు. అల్లూరు వద్ద గల హెలీ ప్యాడ్ పనులను పరిశీలించారు. మల్యాల వద్ద గల హంద్రీనీవా నీటిపంపింగ్ స్టేషన్, ముఖ్యమంత్రి జలహారతి నిర్వహించే


హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులు


హంద్రీ-నీవా ప్రాజెక్టు వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, ఎస్పీ


ప్రదేశం, రైతులతో కలిసి మాట్లాడే సభాస్థలి ప్రదేశాలను, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ముందస్తు ఏర్పాట్లను, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆమె తెలిపారు. సీఎం పర్యటన ప్రదేశాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టాలని అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రజా ప్రతినిధులు, ప్రజలు వస్తున్నందు వల్ల ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేసి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఆర్‌డీవోలు, డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నందికొట్కూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబు పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసు అధి కారులకు సూచించారు. బుధవారం అల్లూరు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం పర్యటన విధుల పట్ల అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయినప్పటి నుంచి తిరిగి వెళ్లే వర కు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. సీఎం పర్యటనలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 37 మంది ఇన్‌స్పెక్టర్లు, 52 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 177 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 308మంది కానిస్టేబుళ్లు, 49మంది మహిళా పోలీసులు, 84మంది హోంగార్డులు, 105 సాయుధ బలగాలు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు, 6స్పెషల్ పార్టీ బృందాలతో పటిష్ట బందోబస్తును నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మందజావళి ఆల్ఫ్రెస్, ఎస్.ఎస్.జి అధికారులు రమణ, శాంతా రావు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఆర్ఐవో రాఘవేంద్ర, డీఎస్పీలు ప్రమోద్, రామాంజి నాయక్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా..



నంద్యాల/నందికొట్కూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గురువారం ఉదయం 9.30 గంటలకు ఢిల్లీలోని జన్‌పథ్ నుంచి బయలుదేరి 10 గంటలకు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఢిల్లీలో ఉదయం10.10 గంటలకు బయలుదేరి 12.25 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.35 గంటలకు బయలుదేరి 12.45 గంటలకు నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వస్తారు. 12.45 నుంచి 12.50 గంటల వరకు హెలిప్యాడ్ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 12.50 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా 1.00 గంటకు మల్యాలలోని హెచ్.ఎన్.ఎస్.ఎస్ పంపింగ్ స్టేషన్-1 వద్దకు చేరుకుంటారు. 1 గంట నుంచి 1.45 గంటల వరకు కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. 1.45 నుంచి 2.15 భోజన విరామం తీసుకుంటారు. 2.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు మల్యాల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన నీటి సహాయక సంఘాలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. 3.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 3.50 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. 4.45 గంటలకు విజయవాడకు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు పాల్గొంటారు.

హాజరు కానున్న ప్రజాప్రతినిధులు

నంద్యాల, జూలై 16(ఆంధ్రజ్యోతి): హంద్రీ నీవాకు మల్యాల ఎత్తిపోతల వద్ద నీరు విడుదల చేయడానికి గురువారం సీఎం చంద్రబాబునాయుడుతోపాటు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వస్తున్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు మల్యాల నీటి విడుదల కార్యక్రమానికి హాజరుకానున్నారు. సీఎం రాకతో.. ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లా టీడీపీ శ్రేణులతో పాటు రైతుల్లో ఆనందం నెలకొంది.

20న 'ఐఐఐటీ డీఎం' స్నాతకోత్సవం

- ఇస్రో చైర్మన్ నారాయణన్ రాక

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జగన్నాథగట్టుపై ఉన్న ఐఐఐటీ డీఎంలో ఈనెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు కృష్ణా సెమినార్‌లో 7వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇస్రో చైర్మన్ డా.వి.నారాయణన్, ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ డైరెక్టర్ పద్మశ్రీ ప్రొ.దేశ్‌మాన్ విజయలక్ష్మి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పెరిగిన పత్తి ధర

- క్వింటాం గరిష్ఠంగా రూ.8269


విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు పుంజుకున్నాయి. బుధవారం పత్తి ధర గరిష్ఠంగా క్వింటాళ్లు రూ.8269 పలికింది. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో మళ్లీ ధరలు పెరుగుతుండడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెలరోజులతో పోల్చితే క్వింటానికి గరిష్ఠంగా రూ.200పైగా ధర పెరిగింది. 117 క్వింటాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5216, గరిష్ఠ ధర రూ. 8269, మధ్య ధర రూ. 8080 పలికింది.

19న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల కల్చరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): నంద్యాల, టెక్కలోని విద్యుత్ కార్యాలయంలో శనివారం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30నిమిషాల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ట్లు ఈఈ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, విద్యుత్ అధికారులు, విద్యుత్ సిబ్బంది హాజరవుతారన్నారు. నంద్యాల డివిజన్ పరిధిలోని నంద్యాల టౌన్, గ్రామీణ, నంద్యాల, మహానంది, బండి ఆత్మకూరు, వెలుగోడు, పాణ్యం, గడివేముల మండలంలోని విద్యుత్ వినియోగదారులు వారి సమస్యలుంటే అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని ఈఈ కోరారు.

ట్యాంకర్లతో పంటకు నీరు

జూపాడుబంగ్లా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాభావంతో రైతులు అల్లాడిపోతున్నారు. కొద్దిపాటి వర్షంతో ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న పంటలు వాడుముఖం పట్టాయి. ఉన్నబోర్లలో నీరు ఇంకిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలు కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో భాగంగానే జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన రైతు నెలకిందట సాగుచేసిన మొక్కజొన్న వాడుపడుతుండటంతో బుధవారం ట్యాంకర్లద్వారా నీటిని తొటుకుంటు మొక్కను బతికించుకుంటున్నారు.


తంగడంచ పొలిమేరలో ట్యాంకర్ల ద్వారా మొక్కజొన్న పంటను తడుపుకుంటున్న రైతులు

ఒక ట్రాక్టర్‌కు రూ.600 ఖర్చు



నెలకిందట వర్షం పడటంతో రెండెకరాల్లో మొక్కజొన్న సాగుచేశా. అప్పటి నుంచి వర్షం పడకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. ఉన్న రెండుబోర్లు కూడా భూగర్భజలాలు అడగంటిపోయాయి. వర్షం పడుతుందేమోనని భూమిలో ఎరువులు వేశాను. వర్షం జాడ కనబడకపోవడంతో పంట వాడుపడుందని, ఒకట్రాక్టర్ రూ.600 ఖర్చుపెట్టి పంటను కాపాడుకుంటున్నాను. ఖర్చు భారంగా మారింది.

- చిన్నబాబు, రైతు, తంగడంచ గ్రామం

చదువుకు సాయం
- పేద విద్యార్థులకు రవాణా భత్యం
- పకడ్బందీగా విద్యాహక్కు చట్టం అమలు

6

గ్రామీణ వైద్యుల గుర్తింపునకు కృషి

7

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు


చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 16(ఆంధ్రజ్యోతి) :మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం ఆషాడమాస షష్ఠి కర్కాటక సంక్రమణలో భాగంగా ఉదయం జరగాల్సిన ప్రత్యేక పూజలు మధ్యహ్నం 12.20 గంటల నుంచి రాఘవరాయుడికి అభిషేకాలు ప్రారంభమయ్యాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మూలరాములకు కనకాభిషేకం చేసి హస్తోదకం చేశారు. ప్రహ్లాదరాయల పాదపూజ అనంతరం పల్లకిలో ఊరేగించారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగాణు చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో మంత్రాలయం మార్మోగింది.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీపీఎం


పంటను పరిశీలిస్తున్న డీపీఎం శ్రీనివాసులు

బనగానపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులు దృష్టి సారించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం యనకండ్ల, కైప గ్రామాల్లో నవధాన్యాల ద్వారా సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. డీపీఎం ప్రకృతి వ్యసాయంలో నవధా న్యాలు చల్లుకొని పోషక లోపాలు తగ్గించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పెట్టుబడులు తగ్గించుకోవచ్చొన్నారు. ఆదర్శ రైతులు లత, నారాయ ణరెడ్డి, సురేష్, రామరాజు, అడిషనల్ డీపీఎం సలామ్, రవీంద్రాచారి, విజయభాస్కర్, మౌనిక, సోమశేఖర్, కులాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి వరద

- 881.80 అడుగులకు చేరిన నీటిమట్టం
- నీటిలభ్యత 197.91 టీఎంసీలు
- సాగర్‌కు 68,338 క్యూసెక్కులు



నంద్యాల, జూలై16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. జూరాల నుంచి 36,613 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 16,688 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ ఉత్పాదన కింద 68,338 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో బుధవారం సాయంత్రానికి నీటి మట్టం 885.00 అడుగులు ఉండగా.. 881.80 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా నీటి లభ్యత 197.91 టీఎంసీలుగా నమోదైంది.

31లోపు బంగారు కుటుంబాల దత్తత పూర్తికావాలి

- ఇప్పటి వరకు 64,128 బంగారు కుటుంబాల గుర్తింపు
- మార్గదర్శులను గుర్తించేందుకు గ్రామ కమిటీలు
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ లోపు బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు, డిస్ట్రిక్ట్ విజన్ ప్లాన్ యూనిట్, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్ సభ్యులతో జీరో పావర్టీ పీ-4 పాలసీ అమలుపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో పావర్టీ పీ-4 పాలసీ అమలులో భాగంగా జిల్లాలో 64,128 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. గ్రామాలు, వార్డుల్లో ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించడం జరుగుతోందని, గ్రామసభల్లో ఈ బంగారు కుటుంబాల జాబితాను మరోసారి పరిశీలించి అర్హులైన వారితో తుది జాబితాను తయారు చేయాలన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శులను గుర్తించేందుకు గ్రామ కమిటీలు వేయాలని సూచించారు. గ్రామానికి ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్, ఇండస్ట్రీస్, డాక్టర్స్, తదితరులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎం పర్యటన జయప్రదం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉమ్మడి జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం మధ్యాహ్నం 1 గంటలకు నందికొట్కూరు నియోజకవర్గంలోని మల్యాల గ్రామ సమీపంలో రూ.3800కోట్లతో హెచ్ఎన్ ఎస్ఎస్ (హంద్రీ నీవా)ఆధునికీకరణ పనులు చేపట్టిన తర్వాత నీటి విడుదల చేస్తారన్నారు. ఆతర్వాత జలహారతి, 2.30గంటలకు బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి కమిటీల నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ప్రత్యేక ఇరిగేషన్ కమిటీ ఏర్పాటు చేయాలి

- సీఎం ప్రకటనను స్వాగతిస్తాం
- రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు

బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక ఇరిగేషన్ కమిటీ ఏర్పాటుచేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధే లక్ష్యమని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన హక్కు చట్టం ద్వారా రాయలసీమలో 21లక్షల ఎకరాల ఆయకట్టుకు కృష్ణాజలాల లభ్యత ఉన్నప్ప టికీ నేడు ఎనిమిది లక్షల ఆయకట్టుకు మాత్రమే నీరు పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలో ఉన్న వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్నప్పటికీ కేవలం 8.8 శాతం ఆయకట్టుకు మాత్రమే నీళ్లు లభిస్తున్నాయన్నారు. ఇంత తక్కువ శాతం సాగు నీరు లభిస్తున్న ప్రాంతం రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. తుంగభద్ర ఎగువ సమాంతర కాల్వ, గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, సిద్ధేశ్వరం అలుగు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సమగ్రంగా కార్యాచరణ రూపొందిస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధికి సీఎం యుద్ధప్రాతిపదికన కార్యాచరణ చేపట్టాలని కోరారు.

చదువుకు సాయం



- పేద విద్యార్థులకు రవాణా భత్యం
- పకడ్బందీగా విద్యాహక్కు చట్టం అమలు

హాలహర్వి, జూలై 16(ఆంధ్రజ్యోతి): పేద పిల్లలు ఏ కారణంతోనూ చదువు ఆపకూడదని, వారికి నాణ్యమైన విద్య అందించాలని కూటమి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. దీనికి అనేక సంస్కరణలు చేపట్టింది. ప్రస్తుతం ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో తల్లుల ఖాతాలో నిధులు జమ చేసింది. మధ్యాహ్న భోజనం కోసం సన్న బియ్యాన్ని అందిస్తోంది. కొత్తగా దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు మరో పథకానికి శ్రీకారం చుట్టింది. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి బస్సు సౌకర్యంలేని గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యార్థి ఖాతాలో రవాణా భత్యం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది.

చదువు కోసం అవస్థలు

జిల్లాలోని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎర్రబస్సు ఎరుగని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. రోడ్లు లేక, బస్సులు రాక అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. ఇందులో కొంతమంది తల్లిదండ్రులు భారమైనా ఆటోలు ఏర్పాటు చేసి పిల్లలను చదివించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేద విద్యార్థుల చదువుకు సాయం అందించేందుకు రవాణా భత్యం ప్రభుత్వమే ప్రతి మూడు నెలలకోసారి అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులను ఆదేశించారు.

పథకం అమలు ఇలా

పేద పిల్లల చదువులు అర్ధాంతరంగా ఆగిపోకుండా ఉండేందుకు రవాణాభత్యం చెల్లించాలని విద్యాహక్కు చట్టంలో పొందుపరిచారు. ప్రభుత్వం ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి సిద్ధమైంది. రవాణాభత్యాన్ని కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం అందించాలి. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటి నుంచి కి.మీ. నుంచి మూడు కి.మీ. దూరంలో ఉన్న 6 నుంచి 8వ తరగతి విద్యార్థులు ఇంటి నుంచి మూడు కి.మీ. పైనున్న వారికి రూ.600 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ భత్యాన్ని మూడు నెలలకు ఓసారి తల్లిదండ్రుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. యేడాదికొకసారి చెల్లిస్తే తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని మూడు నెలలకోసారి చెల్లిస్తే వెసులుబాటు కలుగుతుందని ప్రభుత్వం భావించింది. ఈ పథకం వల్ల జిల్లాలో 80 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

మారుమూల పల్లెలకు వరం



హాలహర్వి మండలంలో అనేక మారుమూల పల్లెలకు బస్సు సౌకర్యాలు లేవు. ఆ పిల్లల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రభుత్వం రవాణా భత్యం చెల్లించేలా తీసుకున్న నిర్ణయం పేద పిల్లలకు వరంగా మారింది.

● ఉమాకాంత్‌స్వామి, చింతకుంట గ్రామం

అందరికీ అందేలా చూస్తాం



దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే పిల్లలందరికీ రవాణా భత్యం అందేలా చర్యలు తీసుకుంటాం. ఈ యేడాది పకడ్బందీగా ప్రతి తల్లిదండ్రుల ఖాతాలో నిధులు జమ అయ్యేలా చూస్తాం.

● ఈరన్న, ఎంఈవో, హాలహర్వి మండలం



చదువు కోసం కాలిబాట పడుతున్న విద్యార్థులు


మంచి నిర్ణయం



మా గ్రామంలో 6 నుంచి 8వ తరగతి చదివే విద్యార్థులు 50 మంది రోజూ బడికి నడిచి వెళ్తున్నారు. వారి కష్టాన్ని చూడలేక మేమే ఆటోలను ఏర్పాటు చేసి నెలనెలా వారికి డబ్బులు చెల్లిస్తున్నాం. ఇప్పటి నుంచి ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని తెలియడంతో సంతోషంగా ఉంది.

● మల్లికార్జున, పచ్చారపల్లి గ్రామం

సీఎం సారూ.. ఆలయాలపై దృష్టి సారించరూ..!



కొలనుభారతి క్షేత్రం

- నల్లమలలో కొలువైన రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయం
- కృష్ణాతీరంలో వెలసిన చారిత్రాత్మక సంగమేశ్వరాలయం

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని రెండు ప్రసిద్ధ ఆలయాలు సీఎం సారూ.. దృష్టి సారించాలని భక్తులు వేడుకుంటున్నారు. నందికొట్కూరు నియోజకవర్గం లోని కొత్తపల్లి మండలంలో ఈ ఆలయాలు వెలిశాయి. ఆంధ్రప్రదేశ్‌లోనే ఏకైక సరస్వతీ ఆలయంగా విరాజిల్లుతున్న కొలనుభారతి క్షేత్రం ఒకటి. మరొకటి సప్తనదుల సంగమ ప్రదేశంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రం. ఈ రెండు క్షేత్రాలు ఆధ్యాత్మికంగా ఎన్నో విశేషా లను సొంతం చేసుకున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం అన్నివిధాలుగా నిరాదరణకు గురయ్యాయి. గతంలో టీడీపీ హయాంలోనే ఈ క్షేత్రాల అభివృద్ధిపై అడుగు పడినప్పటికీ ఆతర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. గురువారం నందికొట్కూరు నియోజకవర్గంలోని మల్యాల ఎత్తిపోతల వద్దకు సీఎం చంద్రబాబు రానుండటంతో ఈ క్షేత్రాలపై అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దేశంలోనే ప్రసిద్ధి..

కొలనుభారతి క్షేత్రం దేశంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచింది. నల్లమల పర్వత సానుల నడుమ 11వ శతాబ్దానికి ముందే ఈ క్షేత్రం ఆవిర్భవించినట్లు ప్రాచీన చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్లోనే క్షేత్రంలో సప్తరుషులచే సప్తశివాలయాలను కూడా నిర్మించి ఆయా శివాలయాల్లో శివలింగాలను ప్రతిష్ఠించారు. క్షేత్రంలో సహజసిద్ధంగా ఏర్పడిన చారుఘోషిని తీర్థం నిరంతరం జీవనదిలో ప్రవహిస్తుంది. ఈక్షేత్రానికి ఏటా పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ప్రభుత్వం సదుపాయాలను కల్పిస్తే రాష్ట్రానికే కొలనుభారతి క్షేత్రం తలమానికంగా నిలువనుంది.

సప్తనదులు సంగమించే దివ్యధామం

కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరతి, భవనాశి అనే ఏడు నదులు సంగమించే దివ్యధామం సప్తనదీ సంగమేశ్వర క్షేత్రం. ద్వాపరయుగంలో పంచపాండవులు అరణ్యవాసం చేసిన సమయంలో ఇక్కడ వేపదారు శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణా ల ద్వారా తెలుస్తోంది. శ్రీశైల జలాశయ నిర్మాణం పూర్తయిన తర్వాత 1980లో సప్తనదీ సంగమేశ్వరం కృష్ణమ్మ గర్భంలోకి చేరుకుంది. అప్పటి నుంచి 24ఏళ్ల పాటు జలాధివాసమైన సంగమేశ్వరుడు మొట్టమొదటి సారిగా 2003లో బయటపడి భక్తులచే పూజందుకుంటున్నాడు. ఆతర్వాత నుంచి 8మాసాలు జలాధివాసమై నాలుగు మాసాలు మాత్రమే భక్తులచే పూజలందుకుంటారు. కృష్ణా పుష్కరాల సమయంలో రూ.90లక్షల సీజీఎఫ్ నిధు లతో జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించినప్పటికీ నిధుల సరిపోక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.



సంగమేశ్వరాలయం

వాసవి సత్రాల నిర్వహణకు దాతలే దేవుళ్లు

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- త్వరలో తిరుపతి, విజయవాడలోనూ అన్న సత్రాలు
- వాసవి సంస్థ ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో వాసవి సత్రాల నిర్వాహక ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాసవి సత్రాల నిర్వహణకు దాతలు మనకు దేవుళ్లు అని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం కర్నూలులో జరిగిన వాసవి సత్ర సముదాయాల నిర్వాహక ప్రతినిధులతో టీజీ వెంకటేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలతో పాటు సామాన్య భక్తులకు కూడా మంచి సౌకర్యాలు కల్పించాలన్నారు. వాసవి సత్రాల సంస్థ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెలలోనే తిరుపతిలోనూ, విజయవాడలోనూ వాసవి అన్న సత్రాలు ప్రారంభమవుతారని తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ భవిషత్తులో అరుణాచలం, అయోధ్య, మంత్రాలయం, యాదగిరి గుట్టలలో తమ సంస్థలు ఏర్పాటుకు స్థలాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పంగులూరు సీతమ్మ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తరఫున తిరుపతిలో రూ.40 కోట్లు విలువ చేసే స్థలం వాసవి సంస్థకు 30 ఏళ్లకు ఎంఓయూ రిజిస్టర్ డాక్యుమెంటేషన్ అందజేయడం జరిగిందని తెలిపారు. అది పూర్తయితే తిరుపతికి వచ్చే యాత్రికులకు వసతి, అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సభ్యు లంతా టీజీ వెంకటేశ్‌ను శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

గుండ్రేవుల పూర్తి చేస్తారా?



పత్తికొండ రిజర్వాయర్ కుడి కాలువ

(5వ పేజీ తరువాయి)

జిల్లా రైతాంగం మీద తమకు ప్రేమ, బాధ్యత ఉన్నాయని నిరూపించుకోగలరా? జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన జలనవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులపై ఒత్తిడి తేగలరా? 2019 ఎన్నికల ముందు హడావిడిగా వేసిన శిలాఫలకం చేసిన సీఎం చంద్రబాబు ఇప్పుడు పనులు చేపట్టగలరా? ఈ విడత అయినా గుండ్రేవులను పూర్తి చేస్తారా? అని రైతులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

ఆ ప్రాజెక్టులు తక్షణం చేపట్టాలి

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా వేదవతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును 2019 జనవరి 29న రూ.1,942.80 కోట్లు మంజూరు చేసి జీవో.ఆర్‌టీ.నెం.77 జారీ చేశారు. రూ.106.2 కోట్లు (6.61 శాతం) పనులు చేశారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఆశయంగా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ టెండర్లు హెడ్ వర్క్ పనులు, కాలువ నిర్మాణం రూ.11.90 కోట్లు విలువ పనులు (0.73 శాతం) మాత్రమే చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఐదేళ్ల నిర్లక్ష్యం వెంటాడింది. వైసీపీ హయాంలో రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ)లో భాగంగా రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టారు. సంగమేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్ఆర్ఎంసీలో వేయాలనే లక్ష్యంతో రూ.2020 మే 5న రూ.3,825 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్టీ నంబరు 203 జారీ చేశారు. 2021 ఫిబ్రవరిలో పనులు మొదలు పెట్టి రూ.745.46 కోట్లు (22.54 శాతం) విలువైన పనులు చేశారు. తాజాగా ఈ ప్రాజెక్టులు కొనసాగించేందుకు ఈ నెల 9న సీఎం చంద్ర బాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలపడం రైతుల ఆశలకు జీవం పోసింది. తక్షణం పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతు న్నారు.

పారిశ్రామిక రంగంలో ఆశలు

కూటమి ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లడానికి హడావిడి చేస్తోంది. అదంతా నేల మీదికి వస్తే జిల్లా ప్రగతికి దోహదం చేస్తుంది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పనకు టెండర్లు పిలిచారు. ఇక్కడ వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం అంటోంది. జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎన్ గ్రూపులు సంయుక్తంగా 130 ఎకరాల్లో రూ.14 వేల కోట్ల పెట్టుబడులతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను స్థాపనకు ఒప్పందం చేసుకుంది. 1200 ఎకరాల్లో రూ.13 వేల కోట్లతో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ఒప్పందం, 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతోంది. పత్తికొండ వద్ద రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో చేనేతలకు ఉపాధి లక్ష్యంగా 97.24 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఆలూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో విండ్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు పలు కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. అయితే.. పెండింగ్ ప్రాజెక్టులు, అసంపూర్తి పనులపై కూడా దృష్టి సారించాలి:



ఓర్వకల్లు వద్ద ప్రారంభానికి సిద్ధమైన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ

వీటిపై దృష్టి సారించాలి

- రూ.210 కోట్లు మంజూరు చేసి హంద్రీ నీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువల డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు చేసి పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 61,394 ఎకరాలకు సాగునీరు అందించాలి.
- అసంపూర్తిగా ఉన్న గాజులదిన్నె జలాశయం సామర్థ్యం 5.50 టీఎంసీలకు పెంపు పనులు నిధులు ఇచ్చి పూర్తి చేయాలి.
- అలగనూరు జలాశయం 2.96 టీఎంసీలు సామర్థ్యం. మట్టి ఆనకట్ట కుంగిపోయి ఐదేళ్లు దాటింది. రూ.26.33 కోట్లు నిధులు మరమ్మతులు చేపట్టాలి.
- రూ.450 కోట్లతో చేపట్టిన కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, రూ.480 కోట్లతో చేపట్టిన ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందించాలి.
- జగన్నాథగట్టుపై 192 ఎకరాల్లో రూ.20 కోట్లతో చేపట్టిన రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, ఓర్వకల్లు వద్ద 144.92 ఎకరాల విస్తీర్ణంలో రూ.18 కోట్లతో చేపట్టిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం, 52 ఎకరాల్లో రూ.80 కోట్లతో చేపట్టిన క్లస్టర్ యూనివర్సిటీ భవనాల పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.
- ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో కింద 52,318 ఇళ్లు మంజూరు చేస్తే, 31,289 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టి 23,645 ఇళ్ల వంద శాతం పూర్తి చేశారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో 16,595 ఇళ్లు, నంద్యాల, డోన్, ఆళ్లగడ్డలో 7,050 ఇళ్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగించాలి.



డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం దుస్థితి



కర్నూలు శివారులో టిడ్కో ఇళ్లు



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ భవనాలు

జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

- డీపీఆర్‌వో జయమ్మ



కర్నూలు కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంగళవారం జీవో. ఎంఎస్.నెం.77ను జారీ చేసిందని డీపీఆర్‌వో (జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి) కే. జయమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రీమియం కింద రూ.1250 www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా చెల్లించి లబ్ధి పొందాలని తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, దరఖాస్తు, రెన్యువల్ చేయించుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జర్నలిస్టు భార్య, భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీం వర్తిస్తుందన్నారు. ఈ స్కీంలో భాగంగా ప్రభుత్వం కార్పస్ ఫండ్‌ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్యవైశ్యులు సీఎంకు రుణపడి ఉంటారు

- పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుపై హర్షం
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు ఆర్యవైశ్యులంతా రుణపడి ఉంటారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 50 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం జీవోను జారీ చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాజధాని అమరావతిలో 6.8ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో ఆర్యవైశ్యులంతా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలిపారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో చంద్రబాబుకు ఎవరూ సాటి రారని, అందుకే ఆర్యవైశ్యులు టీడీపీకి ఎల్లవేళలా అండగా నిలుస్తారని తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

రుద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ(58) బుధవారం పాముకాటుకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మహిళ గడ్డికి వెళ్లినప్పుడు పాముకాటుకు గురైంది. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. .

చికిత్స పొందుతూ బేల్దార్..

బేతంచెర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన మల్లె మాధవస్వామి (55) అనే బేల్దార్ (గౌండ) కర్నూలు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. గ్రామంలో మాధవస్వామి అనే బేల్దార్ ఇంటి పని చేస్తుండగా.. ప్రమాదవశాత్తు మంగళవారం ఇంటిపై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని తెలిపారు. మృతుని కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబగుంట్ల గ్రామ పొలిమేరలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. బుధవారం గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్‌రెడ్డి పొలంవద్ద ఉన్న బావి పక్కన మృత దేహం ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడికి వెళ్లి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు దాదాపు 45 ఏళ్లు ఉంటాయి. శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు

- పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరామయ్య

వెల్దుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మత్తుపదార్థాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. బుధవారం వెల్దుర్తి సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి-44 టోల్‌ప్లాజా వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహించామన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్‌కు చెందిన అఖిల్ చౌదరి మంజీరా హోటల్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10గ్రాముల కొకైన్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ మధు సూదనరావు, వెల్దుర్తి, క్రిష్ణగిరి ఎస్‌ఐలు అశోక్, క్రిష్ణమూర్తి ఉన్నారు.

మళ్లీ క్యాంటీన్ వివాదం

- ఉదయం వైద్యుల సంఘం తాళం
- సాయంత్రం పగులకొట్టిన నిర్వాహకులు



క్యాంటీన్ వద్ద ఉన్న ఏపీజీడీఏ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ) ఆవరణలో ఉన్న క్యాంటీన్ వివాదం రోజురోజుకూ ముదురుతుంది. క్యాంటీన్ నిర్వాహకులు తమదేనని అంటే, ఒక వైద్యుల వర్గం.. కాదు కాదు.. క్యాంటీన్ తమదేనని వాదిస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) కర్నూలు కేఎంసీ బ్రాంచ్ అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్యవిద్యార్థులు కలిసి క్యాంటీన్‌కు తాళం వేశారు. సాయంత్రం మళ్లీ కొందరు క్యాంటీన్ తాళం పగులకొట్టి ప్రారంభించారు. గతంలో కూడా రెండుసార్లు ఇదే విధంగా ఏపీజీడీఏ సంఘం కార్యవర్గం ప్రతినిధులు తాళం వేయడం ఆ తర్వాత పగులకొట్టడం జరిగింది. ఏపీజీడీఏ అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ రిమూవ్‌డ్ ఫ్రమ్ సర్వీస్ అయిన వ్యక్తికి క్యాంటీన్ నిర్వహించే హక్కు లేదన్నారు. కాలేజీ ఆవరణలో క్యాంటీన్ తాళం పగులగొట్టడం సరికాదని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

● క్యాంటీన్ నిర్వాహకులు లీగల్‌గా తమకు హక్కు ఉందని, బలవంతంగా క్యాంటీన్‌ను మూసివేయడం తగదని అన్నారు. దాన్ని పరిష్కరించడానికి ప్రిన్సిపాల్ గానీ, పోలీసులు గానీ ముందుకు రాలేదు.

ఇన్‌చార్జీలే దిక్కు..!

- పది నెలలుగా జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో గాడి తప్పిన పాలన
- సరైన సేవలు అందక ప్రజల అవస్థలు



కర్నూలులోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం



ప్రజలు సతమతం..

కర్నూలు జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రతిరోజూ స్లాట్ బుకింగ్‌లో అధిక రిజిస్ట్రేషన్లు జరిగే కర్నూలు, ఆదోని, నంద్యాల ఆర్వోల్లో ప్రజల తాకిడి అధికంగా ఉంటుంది. సీనియర్ అసిస్టెంట్‌కు సబ్-రిజిస్ట్రార్‌గా కర్నూలు ఇన్‌చార్జ్ ఇవ్వడం, ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ఉండాల్సిన చోట ఒక్కరే పనిచేస్తుండటంతో సహజంగానే ఒత్తిడి అధికంగా పడుతోంది. అటు ఆదోనిలో డిప్యుటేషన్‌పై సునంద విధులు నిర్వహిస్తున్నారు. గుడూరులో ఇన్‌చార్జ్ సబ్-రిజిస్ట్రార్ విధుల్లో ఉన్నారు. నంద్యాల పరిధిలో అవుకు, బనగానపల్లె, నంద్యాల ఆర్వోలకు రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ల స్థానంలో ఇన్‌చార్జ్‌లే ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం అందించే శాఖల్లో అత్యంత కీలకమైనది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ. ప్రస్తుతం ఆ శాఖలో పాలన గాడి తప్పింది. సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, కర్నూలు-1, 2 గుడూరు సబ్-రిజిస్ట్రార్లు లేక ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. అత్యధికంగా కర్నూలు, కల్లూరు, నంద్యాల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు పది నెలలకు పైగా ఖాళీగా ఉండటంతో సేవలు సరిగా అందక పాలన ముందుకు సాగడం లేదన్న విమర్శలున్నాయి. ప్రతిరోజూ స్లాట్ బుకింగ్‌లో అధిక రిజిస్ట్రేషన్లు జరిగే కర్నూలు, ఆదోని, నంద్యాల ఆర్వోల్లో ప్రజల తాకిడి అధికంగా ఉంటుంది. నిత్యం వందలాదిగా రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కల్లూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇన్‌చార్జీలతో పాలన కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం అందించే రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు, కర్నూలు-1 ,2 గుడూరు సబ్-రిజిస్ట్రార్లు లేక ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతిరోజూ దాదాపు 400-500 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అత్యధికంగా కర్నూలు, కల్లూరు, నంద్యాల కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు పది నెలలకు పైగా ఖాళీగా ఉండటంతో సేవలు సరిగా అందక పాలన ముందుకు సాగడం లేదన్న విమర్శలు న్నాయి. కర్నూలు డీఆర్‌గా సీహెచ్.నాగమల్లేశ్వర్ రావు బదిలీ అనంతరం ఇప్పటివరకు రెగ్యులర్ జిల్లా రిజిస్ట్రార్‌ను నియమించకపోవడంతో పాలన పడకేసింది. నిత్యం వందలాదిగా రిజిస్ట్రేషన్ సేవల కోసం కార్యాలయాలకు వచ్చే క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ఏడాది లక్ష్యం రూ.399 కోట్లు

కర్నూలు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 399 కోట్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. కర్నూలు జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అందులో కర్నూలు 1, 2, కల్లూరు, గుడూరు, కోడుమూరు, మంత్రాలయం, ఆదోని, ఆస్పరి, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు ఉన్నాయి. వాటిలో రిజిస్ట్రేషన్ శాఖ అధిక ఆదాయం కర్నూలు-1, 2 అలాగే కల్లూరు నుంచి వస్తోంది. కీలకమైన స్థానాల్లో రెగ్యులర్ సబ్-రిజిస్ట్రార్‌లను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

2024లో నిర్వహించిన బదిలీల్లో..

గత పది నెలలుగా కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. 2024లో ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో డీఆర్ సీహెచ్.నాగలింగేశ్వరరావు విశాఖపట్నం బదిలీపై వెళ్లారు. ఆతర్వాత కొన్నిరోజులు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కర్నూలు డీఐజీ పీజీయస్. కళ్యాణి ఇన్‌చార్జ్ డీఆర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత చెన్నకేశవరెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించగా కొద్దిరోజులు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఆ తర్వాత సెలవుతో వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురానికి చెందిన భార్గవ్‌కు కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలివ్వగా కొన్నిరోజులు మాత్రమే పనిచేశారు. ప్రస్తుతం నంద్యాల డీఆర్ జానకిదేవికి కర్నూలు డీఆర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అందించారు. తమ సమస్యల పరిష్కారం కోసం డీఆర్‌ను కలిసేందుకు వచ్చే ప్రజలకు సరైన సేవలు అందడంలేదు. ఇలా కీలకమైన జిల్లా రిజిస్ట్రార్ పోస్టును భర్తీ చేయడంలో అధికారులు ప్రభుత్వం విఫలమయ్యారని క్రయ, విక్రయదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సేవలు అందక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ పోస్టుల ఖాళీలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కర్నూలు-1, 2, గుడూరు, అవుకు, బనగానపల్లె, నంద్యాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో కీలకమైన కర్నూలు ఆర్వోలో రెండు రెగ్యులర్ అధికారుల కోసం పలు పర్యాయాలు ప్రభుత్వానికి లేఖలు రాశాం. ప్రస్తుతం సాధారణ బదిలీలకు అవకాశం లేదు. మరోసారి ప్రభుత్వానికి లేఖ రాస్తాం. **● పీజీయస్.కళ్యాణి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, కర్నూలు**

వాటా ఇస్తేనే..

- కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల డిమాండ్
- యూనియన్ నాయకులతో కలిసి దందా
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- హాట్ టాపిక్‌గా బకాయిల పంచాయితీ



కర్నూలు న్యూసిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇటీవలే ప్రభుత్వం బకాయి వేతనాలను విడుదల చేసింది. సుమారు 21 మంది కార్మికులకు మూడేళ్ల కిందట రావాల్సిన బకాయిలు వచ్చాయి. ఈ క్రమంలో బకాయి వేతనాలు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఖాతాలో జమఅయ్యాయి. వేతనాల్లో తమ వాటా ఇస్తేనే మిగతా డబ్బులు ఇస్తామని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెబుతున్నట్లు సమాచారం.

దందాకు తెర..

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్మిక సంఘాల నాయకులతో దందాకు తెర లేపారు. కార్మికుల నుంచి అందినకాడికి దోచుకునేందుకు పావులు కదుపుతున్నారు. బకాయి వేతనాలు తామే ప్రభుత్వంతో ఒప్పించి ఇప్పించామని యూనియన్ నాయకులు అంటున్నారు. అయితే వేతనం రూ.13 వేలు ఉండగా రూ.15 వేలు చేయించింది తామేనని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెప్పుకుంటున్నారు. మూడేళ్ల క్రితం పారిశుధ్య విభాగంలో 21 మంది కార్మికులను విధుల్లోకి తీసుకున్నారు. వారికి అప్పట్లో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఆ బకాయిలొచ్చాయి. ఒక్కో కార్మికుడికి ఆరు నెలలకు కలిపి రూ.90 వేలు రావాలి. ఒక్కో కార్మికుడి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రూ.10 నుంచి రూ.15 వేలు డిమాండ్ చేస్తుండగా యూనియన్ నాయకులు ఒక్కో కార్మికుడి నుంచి రూ.2 నుంచి రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వేతనాల పంచాయితీ నగర పాలకలో హట్ టాపిక్‌గా మారింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఈ విషయంపై స్పందించి న్యాయం చేస్తారని కార్మికులు ఆశిస్తున్నారు. బకాయిలను నేరుగా కార్మికుల ఖాతాల్లో జమచేయవచ్చు. అధికారులు ఆ దిశగా ఆలోచించకుండా వాటాలు పంచుకోవచ్చనే ఉద్దేశ్యంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఖాతాలో జమ చేశారు. ఈ నేపథ్యంలోనే వాటాలు పంచుకోవడానికి మార్గం సులువైంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు

కార్మికుల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాము. ఇప్పటి వరకు ఎవ్వరూ మా దృష్టికి తీసుకు రాలేదు. మాకు తెలిసి కూడ కార్మికులను ఫిర్యాదు చేయమని చెప్పినా ఎవ్వరు ముందుకు రావడము లేదు. అలాంటప్పుడు చర్యలు ఎలా తీసుకుంటాం. ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ఇవ్వలేదని తెలిసింది. మిగిలిన వారందరు కార్మికులకు డబ్బులు ఇచ్చేసారు. **- డా.కే. విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ, కర్నూలు**

నగదు తస్కరించిన వారిపై చర్యలు

- విధుల నుంచి తొలగింపు
- 600 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో స్వామివారి హుండీ నుంచి నగదును తస్కరించిన పరిచారకుడు విద్యాధర్‌పై చర్యలు తీసుకుంటూ విధుల నుంచి తొలగించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు సమక్షంలో పంచనామా నిర్వహించారు. తస్కరించిన నగదు పరిశీలనలో విద్యాధర్ రూ.24,220లు నగదు తస్కరించినట్లు తేలిందని ఈవో తెలిపారు. ప్రాథమికంగా అతడిని విధుల నుంచి తొలగించి సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని అన్నారు. ఆలయ భద్రతా దృష్ట్యా దేవస్థానంలోని వివిధ ప్రదేశాల్లో 600 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని ఈవో తెలిపారు.

గ్రామీణ వైద్యుల గుర్తింపునకు కృషి చేస్తా



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్

- మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్
- గ్రామీణ వైద్యులపై అపారమైన నమ్మకం: మంత్రి టీజీ భరత్
- ప్రభుత్వం వీరికి శిక్షణ ఇవ్వాలి : కేజీ గోవిందరెడ్డి
- కర్నూలులో గ్రామీణ వైద్యుల మహాసభ

కర్నూలు హాస్పిటల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుల గుర్తింపునకు కృషి చేస్తాననని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమం సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టీడీ జనార్దన్ అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా రైల్వేగేటు పక్కన ఉన్న శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభ డా.కేజీ గోవిందరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీ జనార్దన్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సేవలు చాలా ఉపయోగపడుతాయని, వారి సేవలను వినియోగించుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపైన అపారమైన నమ్మకం ఉందని అన్నారు. వీరి సేవలను ప్రభుత్వం వినియోగించుకునేలా కృషి చేస్తానన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ తాను అనారోగ్యానికి గురైతే ఆర్ఎంపీ వైద్యులతోనే వైద్యం చేయించుకుంటానన్నారు. గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మంది గ్రామీణ వైద్యులు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ ఇచ్చిన ప్రభుత్వం వీరికి శిక్షణ ఇవ్వాలని కోరారు. దేశ వ్యాప్తంగా గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కారానికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి ఎంఎన్ రాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి, కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు గార్గేయపురం శ్రీనివాసులు, నాగేశ్వరరెడ్డి , కర్నూలు జిల్లా సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి రఘునాథరెడ్డి, జిల్లా నాకులు ఇల్లూరి నరసింహ, నంద్యాల జిల్లా నాయకులు నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాలి

- కర్నూలు జిల్లా మేధావుల వేదిక ప్రతినిధులు



సమావేశానికి హాజరైన జిల్లా మేధావుల వేదిక ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చారిత్రక కట్టడాలను, ప్రదేశాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని కర్నూలు జిల్లా మేధావుల వేదిక ప్రతనిధులు అన్నారు. బుధవారం నగరంలోని మద్దూరునగర్‌లో గల పింగళి సూరన తెలుగుతోట సమావేశహాలులో జిల్లా మేధావుల వేదిక ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహించారు. సామాజికవేత్త కేసీ కల్కూర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆచార్య ఎస్ మన్సూర్ రహమాన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రభుత్వ భవనాలైన జడ్పీ భవనం, మున్సిపల్ స్కూల్, గడియారం ఆసుపత్రి, జీజీహెచ్(పెద్దాసుపత్రి) వాటి నిర్వహణ గాలికొదిలేశారన్నారు. ఆ గొప్ప భవనాలు కనిపించకుండా వాణిజ్య ప్రకటనల హోర్డింగ్స్‌తో దాచివేశారని విమర్శించారు.

ఉస్మానియా కళాశాల భవానికి వారసత్వ ప్రదేశంగా, పెద్ద కడుమూరులోని రాయల చెరువును ప్రపంచ వారసత్వ నీటి నిర్మాణంగా గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేతవరం రాత్రి చిత్రాల పరిరక్షణకు అక్కడ కొండ ప్రాంతాలలో జరుగుతున్న మైనింగ్ పనులు ఆపివేయాలని కోరారు. ప్రాచీన ప్రార్థనా స్థలాలుగా చరిత్రకెక్కిన దేవాలయాలు, దర్గాలు, చర్చీలు, గురుద్వారాలు, జైన మందిరాలకు అవసరమైన అభివృద్ధి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్, మాజీ జిల్లా అధ్యక్షులు రణధీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న మార్పులపై చర్చించి విద్యావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు చెప్పారు. డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని, ప్రభుత్వ పీజీ, బీఈడీ కళాశాలలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆత్మకూరులోని ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దినేష్, ప్రశాంత్, సుజాత, అక్రమ్ తదితరులు ఉన్నారు.

సర్ప జాతులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్లు

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతు నేస్తాలైన సర్పజాతులను కాపాడుకోవాలని వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్ అరుణ్‌వెస్లీ, నాచురలిస్ట్ కాళీచరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ప్రపంచ పాముల దినోత్సవాన్ని పురస్కరించుకుని బైర్లూటిలోని ఏకోటూరిజంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. జీవవైవిధ్యంలో ప్రతిజీవిని కాపాడుకోవాలని అన్నారు. ప్రపంచంలో 3600 సర్పజాతులు ఉన్నాయని, ఇందులో మన దేశంలో 360 వరకు సర్ప జాతువు ఉన్నట్లు తెలిపారు. వాటిబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు జీవీ.కృష్ణ, విద్యాసాగర్, రామశేఖర్, అచ్యుత్‌కుమార్, టూరిజం మేనేజర్ ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం


గాజులపల్లి ఆర్ఎస్ వద్ద నీటిని విడుదల చేస్తున్న పీసీ చైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి

మహానంది, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ ప్రధాన కాల్వ కింద పంటలు సాగు చేసుకొనే రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని తెలుగు గంగ పీసీ చైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని తెలుగుగంగ 14 సబ్ ఛానల్ గేట్లను చైర్మన్‌తో పాటు తెలుగంగ ఈఈ దశరథరాంరెడ్డి గంగమ్మకు సారె,చీరె సమర్పించి తెరిచారు. తెలుగుగంగ ఈఈ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం, ఆళ్ళగడ్డ,నంద్యాల నియోజిక వర్గంలోని 43,946 36 ఎకరాల ఆయకట్టుకు తెలుగుగంగ ద్వారా నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీ క్రాంతికుమార్‌యాదవ్, మహేశ్వరరెడ్డి, డీఈలు ఓబుల్‌రెడ్డి, వెంకటరెడ్డి, సామెయిల్, ఏఈ రమేష్, కుమారితో పాటు టీసీ మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

- మహానంది సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాల్వకు మండల కూటమి నాయకులు జలహారతి ఇచ్చారు. బుధవారం తెలుగుగంగ కాల్వకు జనసేన మండల నాయకుడు మారెడ్డి రామయ్య, టీడీపీ పార్లమెంట్ యువత కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్, మూలస్థానం ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఏడాది రైతులు సుఖ సంతోషాలతో పంటలు పుష్కలంగా పండించుకోవాలని గంగమ్మకు జలహారతి ఇచ్చామని నాయకులు తెలిపారు.

పౌష్టికాహారంతో క్షయ వ్యాధి దూరం

ఆత్మకూరురూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, సరైన వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధి దూరమవుతుందని టీబీ సూపర్ వైజర్ రవికుమార్ సూచించారు. బుధవారం టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొట్టాల చెరువు గూడెంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. 15 రోజులు మించి దగ్గు, విపరీతమైన జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, గళ్లలో రక్తం పడటం ఇలాంటి లక్షణాలు కనిపించినట్లయితే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో పరీక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంబమ్మ,హెల్త్ అసిస్టెంట్ సామక్క పాల్గొన్నారు.

అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు


తల్లీబిడ్డలను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన తల్లిబిడ్డల అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆత్మకూరు అర్బన్ సీఐ రాము వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలోని పోస్టాఫీసు సమీపంలో నివాసం ఉంటున్న పావని తన భర్త వినోద్‌కుమార్ మద్యం సేవిస్తూ తనను వేధిస్తున్న కారణంతో ఈనెల 10వ తేదీన తన కుమార్తెలు లిఖిత, ప్రణవితో కలిసి కట్టుబట్టలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎక్కడ ఆమె ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు అదేరోజు ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్రమత్తమైన ఆత్మకూరు అర్బన్ సీఐ రాము ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనేక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో తల్లిబిడ్డల ఫోటోతో కూడిన మిస్సింగ్ సమాచారాన్ని అన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేశారు. కాగా వివాహం కాకముందే పావని నెల్లూరులో నర్సింగ్ చేయడం వల్ల తాను పిల్లలతో సహా ఎక్కడికి దిక్కుతోచక నెల్లూరు తనకు తెలిపిన వాళ్లవద్దకు వెళ్లింది. అయితే వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారిన తల్లిబిడ్డల మిస్సింగ్ వివరాలు కాస్త పావని వద్దకు చేరడంతో ఆమె ఎట్టకేలకు ఆమె తల్లి ప్రమీలమ్మకు, సోదరుడికి ఫోన్ చేసి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను క్షేమంగానే ఉన్నానని, తన కోసం వెతకవద్దని సూచించింది. ఈ విషయం పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా తల్లిబిడ్డలు నెల్లూరులో ఉన్నట్లు గుర్తించి ఆత్మకూరు పోలీసుస్టేషన్‌కు పిలిపించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. అలాగే భార్యాభర్తలు ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా తల్లిబిడ్డల కేసును ఛేదించడం పట్ల జిల్లా ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణా సీఐ రామును అభినందించారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చునని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్ పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మీడియేషన్ ఫర్ ది నేషన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్గదర్శకం వల్ల సమస్య సామరస్యంగా పరిష్కరించుకోవచ్చునని అన్నారు. పెండింగ్‌లోని ఆయా సంస్థల సివిల్ కాంపౌండ్, క్రిమినల్ కేసులు, రాజీపడదగ్గ కేసుల గురించి వాటి పరిష్కారానికి మధ్యవర్తిత్వం పనిచేస్తోందన్నారు. ఇందుకోసం ఈ నెల 10 నుంచి 16వ తేది వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇరువర్గాల మధ్యలేని పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ రాజీ జరిగిన కేసులకు హైకోర్టు అప్పీల్ కూడా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణ, మాణిక్యారావు, రామకృష్ణుడు తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా ఉంటాం


బాధ్యతలు చేపడుతున్న సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

గడివేముల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉంటామని సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్‌గా సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్‌గా శివారెడ్డి, యుగంధర్‌రెడ్డిలు బాధ్యతలు చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు అందేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన రైతులకు అందిస్తామని అన్నారు. సహకార సంఘ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. తమకు ఈ అవకాశాన్ని ఇచ్చిన పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవోఎంఎస్ నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని సీఐటీయు పట్టణ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిన్ననాగరాజు, తిమ్మయ్య, నబిఖాన్, నాగన్న, మోహన్, రవి, సువర్ణమ్మ, జీవరత్నమ్మ తదితరులు ఉన్నారు.

చేసిన మేలు మరువవద్దు: ఎమ్మెల్యే


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బండిఆత్మకూరు జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన మేలును ప్రజలు ఎప్పటికీ మరువకూడదని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో స్థానిక నాయకులు ఈశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డిల ఆధ్వర్యంలో సుపరిపాలన- తొలిఅడుగు కార్యక్రమం దళితవాడలో నిర్వహించారు. ఇంటింటా ఇంత వరకు కూటమి ప్రభుత్వం అందించిన పథకాలను, ఇవ్వాల్సిన బకాయి పథకాలను వివరించారు. కార్యక్రమంలో తెలుగుగంగ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, మండల క్వనర్ కృష్ణారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ తాటికొండబుగ్గరాముడు, సర్పంచ్‌లు రామచంద్రుడు, రామసుబ్బయ్య, సిద్దయ్య ప్రసాద్, మధురెడ్డి, శీను, రామకృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యాలపై శిక్షణ

పాణ్యం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మాటతీరు మనిషి ప్రవర్తనను తెలుపుతుందని చెన్నై స్కిల్స్ ట్రాక్స్ ట్రైనింగ్ సెంటర్ సీఈవో డాక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. బుధవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం ఆద్వర్యంలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్ అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ఎలా మాట్లాడాలి, ఆంగ్లంపై పట్టు ఎలా సాధించాలన్న వాటిపై నైపుణ్యశిక్షణను విద్యార్థులకు తెలిపారు. శిక్షణలో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ రామిరెడ్డి, కౌసర్‌బాషా, కోఆర్డినేటర్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

రూ.32 కోట్లు విడుదల చేయాలి

నంద్యాల రూరల్ జూలై 16(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పర్యటను గురువారం వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలగనూరు రిజర్వాయర్‌కు రూ.32కోట్లు విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ బుధవారం డిమాండ్ చేశారు. నందికొట్కూరు ప్రాంతలో రైతులు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఏవీ సుబ్బారెడ్డి



నంద్యాల, రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజా చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి కలిశారు. బుధవారం విజయవాడలోని మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి లోకేష్ ఏవీ సుబ్బారెడ్డికి యువగళం పాదయాత్ర పుస్తకాన్ని అందజేశారు.

ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తి


అధికారులతో మాట్లాడుతున్న శివారెడ్డి

జూపాడుబంగ్లా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు ఉద్యోగస్తుల బదిలీ ప్రక్రియ పూర్తయిందని, ఎవరైనా చేరకపోతే ఖాళీల సంఖ్య సమాచారం అందించాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జీ శివారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జూపాడుబంగ్లా సచివాలయాలను తనిఖీ చేసి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. ఎంపీడీవో లాగిన్‌లో ఉద్యోగుల బదిలీలు నమోదై ఉంటాయని, ఖాళీలను చూపిస్తే వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం


అల్లూరు వద్ద గల హెలిప్యాడ్ పనులను పర్యవేక్షిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మల్యాలకు గురువారం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులకు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు వద్ద గల హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. అనంతరం మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు పూర్తి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా గట్టి బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. రైతులతో కలిసి ముఖ్యమంత్రి ముఖాముఖి చర్చల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. రాయలసీమకు నీటి కరువు లేకుండా చేసేందుకు అపర భగీరథ ప్రయత్నం చేశాడని అన్నారు. కేవలం 100 రోజుల్లో హంద్రీ నీవా పనులను పూర్తి చేయించి నీటిని విడుదల చేయడం గొప్ప విషయమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఏ ప్రాజెక్టులోను తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొద్దిరోజుల్లోనే హంద్రీ నీవా పనులను పూర్తిచేసి నాలుగు జిల్లా రైతులకు సాగు, తాగు నీటిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రూ.11.20 కోట్లతో ప్రతిపాదనలు

- ఎత్తిపోతల పథకం డీఈ నాగార్జున్ రావు

కొత్తపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం, శివపురం ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.11.20 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సంగమేశ్వరం లిఫ్టు ఇరిగేషన్ డీఈ నాగార్జున్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శివపురం లిఫ్టు ఇరిగేషన్‌కు రూ.5కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైతే విద్యుత్ మోటార్లు రిపేరీ, కొత్తపైపుల నిర్మాణం, కృష్ణానదిలో 2 కిలోమీటర్ల మేర పూడికతీత, ట్రాన్స్‌ఫార్మర్ల సర్వీసింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే సంగమేశ్వరం లిఫ్టు ఇరిగేషన్‌కు రూ.6.2 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వీటిలో గుమ్మడాపురం ఫేజ్-1లో రెండు కొత్త విద్యుత్ మోటార్ల కొనుగోలు, రెండు పంపులు, ట్రాన్స్‌ఫార్మర్ సర్వీసింగ్ పనులు చేపడుతామన్నారు. అదే విధంగా సంగమేశ్వరం ఫేజ్-2లో విద్యుత్ మోటార్ల మరమ్మతులు, ప్యానెల్ బోర్డులు, పైపుల నిర్మాణాలు ట్రాన్స్‌ఫార్మార్ల సర్వీసింగ్‌లు చేపడుతున్నట్లు వివరించారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

కొత్తపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో బుదవారం తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల జాబితా నిర్వహణ ఏ విధంగా చేయాలని,కొత్తగా ఓటరు కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలని వాటిని కావాల్సిన ధ్రువపత్రాలు, దరఖాస్తు ఫారం ఎలా పూర్తి చేయాలి.. దరఖాస్తు పత్రం ఎక్కడ పొందాలి. ఎన్నికలపై ఓటర్లుకు ఎలా అవగాహన కల్పించాలన్న విషయాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఎన్నికల డీటీ మధుసుధాకర్, సీనియర్ అసిస్టెంట్ కళావతి, కొత్తపల్లి డీటీ అరుణ, ఎలక్షన్ ఆపరేటర్ ఈశ్వర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

నంద్యాల రూరల్ జూలై 16(ఆంధ్రజ్యోతి): డోన్‌లో 30న జరిగే జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ 100 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్నో పోరాటాలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఆహార భద్రత చట్టం తీసుకురావడంలో ఎంతో క్రియా శీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. డోన్‌లో జరిగే మహా సభలో జిల్లా భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి


బొల్లవరంలో మాట్లాడుతున్న ఏడీఏ చెన్నయ్య

మహానంది, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడితో పాటు అధిక లాభాలను పొందవచ్చునని నంద్యాల రూరల్ ఏడీఏ చెన్నయ్య తెలిపారు. బుధవారం మహానంది మండలం బొల్లవరం, నందిపల్లి గ్రామాల్లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచి రసాయనిక ఎరువుల వినియోగంను తగ్గించాలన్నారు. నాణ్యమైన విత్తనాలను వాడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, కృష్ణానదులు పక్కనే ఉన్నా నియోజకవర్గంలోని రైతులు వర్షాధారితంపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గానికి సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. మల్యాల ఎత్తిపోతల పథకం(నాగటూరు) ఎత్తిపోతల పథకం కింద మూడు మండలాల్లో దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని దొంగలు ఎత్తుకుపోయినా పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. మిడ్తూరు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, బెస్తరాజు, మద్దిలేటి, ఓబులేసు, ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి



మాట్లాడుతున్న లిబరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు అందించే నీటి జలాలకు ముఖద్వారంగా ఉన్న నందికొట్కూరు నియోజకవర్గానికి సాగునీరు లేకపోవడం బాధాకరమని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో కరువుతో కుండిపోయిన మిడ్తూరు, కొత్తపల్లి మండలాలకు సాగునీరు అందించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరిలు మిడ్తూరు లిఫ్ట్ ఇరిగేషన్, కొత్తపల్లి మండలంలోని సిద్ధేశ్వరం అలుగు నిర్మాణాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థినిలతో మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు కోరారు. నంద్యాల పట్టణ శివారులోని వైఎస్సార్ నగర్‌లో కస్తూరిబా బాలికల వసతి గృహాన్ని అభిరుచి మధు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేజీబీవీలో నాణ్యమైన చదువుతో పాటు రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారని కొనియాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాలను పరిశీలించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు విద్యను అందించడం వల్ల వారి కుటుంబానికి ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. కేజీబీవీకి తన సొంత నిధులతో ఫర్నీచర్ అందజేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే


నెహ్రూనగర్‌లో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, మాండ్ర

పగిడ్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్తాజయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డిలు తెలిపారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుదవారం నిర్వహించారు. గ్రామంలోని పలు కాలనీలోని ఇండ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అబివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వృద్ధులతో మాట్లాడి పింఛన్ నెల నెల సక్రమంగా అందుతుందా, మహిళలతో తమ పిల్లలకు తల్లికి వందనం పథకం కింద సొమ్ము జమా అయిందా లేదా , ఫ్రీగ్యాస్ సొమ్ము వచ్చిందా అని అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పలు అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళ్లి సీఎం రిలిఫ్ ఫండ్ కింద రూ. 1.70 కోట్లు మంజూరు చేయించామన్నారు. .కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, సర్పచ్ రాజేశ్వరి, నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, హేమసుందరరాజు, రామస్వామి, సొసైటీ డైరెక్టరు పల్లె గంగన్న , షరిఫ్, ఎంపీడీవో సుమిత్రమ్మ, తహశీల్ధార్ శివరాముడు, ఏపీవో మద్దిలేటి, వ్యవసాయాదికారి మురళీధర్ తదితరులు ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రధాని మోదీతోనే సుపరిపాలన

● బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్ రెడ్డి

డోన్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్ రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆదేశాల మేరకు డోన్ నియోజకవర్గంలోని వలసల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. 11 ఏళ్ల పాలనలో ప్రధాని మోదీ సుపరిపాలన అందించారన్నారు. బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య, ఆర్కేరెడ్డి, రామచంద్ర నాయుడు, హెచ్కే నాయుడు, ముదిరాజు, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీవోఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ

ఉయ్యాలవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): వీవోఏలు లోకోస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని వెలుగు ఏపీఎం దాసన్న తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయా గ్రామాల వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పొదుపు సంఘాలను జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం)లో చేర్చాలన్నారు. దీని ద్వారా పొదుపు మహిళలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. మండలంలో 531 సంఘాలు, 5,420 మంది సభ్యులు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ యశోద, ఎల్‌సీ రవికుమార్, సీసీలు గంగన్న, ఆదినారాయణ ఉన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

డోన్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాధార పంటల్లో యాజమాన్య పద్ధతులను పాటించాలని కృషి విజ్ఞాన కేంద్ర సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి సూచించారు. బుధవారం పట్టణంలో డోన్ డివిజన్ రైతు కేంద్ర సిబ్బందికి కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లె, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, బాల్‌రాజు, రవిగౌడు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిదేవి అలంకరణలో వాసవీ మాత

ప్యాపిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి దేవీ ఆలయంలో బుధవారం వాసవీమాత శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ఆర్యవైశ్యులు ప్రత్యేక పుష్పాలు, కూరగాయలతో అలంకరించి, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు.

వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివి

బనగానపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): వసుధ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరామరాజు పేద రోగులకు అందిస్తున్న సేవలు మరువలేనివని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య ఆధ్వర్యంలో పలువురు రోగులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖాదర్, నాయకులు ఉగ్రసేనారెడ్డి, టీచర్ నాగరాజు, మదన్‌భూపాల్‌రెడ్డి, తలారి హరి, రామ్‌బాబు, హర్ష పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శివయ్య

బనగానపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కమిటీని బుధవారం జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా శివయ్య, సభ్యులుగా సుబ్బారెడ్డి, సంజీవులు, బాలక్రిష్ణ, ఎర్రిస్వామి, కులాయిస్వామి, శివనాగయ్య, మద్దిలేటి, సుబ్రమణ్యం ఎన్నికయ్యారు. మండల కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ తనను మండల కార్యదర్శిగా ఎన్నుకున్న రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

డోర్నిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ కింద సాగు చేసే పంట పొలాలకు చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని డబ్ల్యూకొత్తపల్లె డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఏరువ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కేసీ కెనాల్ 19వ లాక్ వద్ద పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో చాకరాజువేముల నీటి సంఘం ప్రెసిడెంట్ లింగుట్ల వెంకట్‌నాయుడు, మహేశ్వర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

డోర్నిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశరి అన్నారు. బుధవారం డోర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు రాముడు, హరికృష్ణ, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలను జయప్రదం చేయండి

కొలిమిగుండ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ఈవో వీరయ్య కోరారు. బుధవారం కొలిమిగుండ్ల శివాలయంలో గ్రామ పెద్దలు, మోతగాళ్లు, ఇతర ఆయకట్టు, గ్రామ ప్రజలతో వేడుకలపై చర్చించారు. కార్యక్రమంలో పేరం సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, కొప్పుల శివ, క్రిష్ణమూర్తి, రఘుస్వామి, మహేశ్‌స్వామి, మొబ్బు శివుడు, పలువురు గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రాధికారెడ్డి నియామకం

బనగానపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాధికారెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీడీవో వెంకటరమణ సెలవుపై వెళ్లటంతో ఆయన స్థానంలో రాధికారెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

దెబ్బతిన్న సచివాలయ బండలు

- ఇబ్బంది పడుతున్న ప్రజలు - పట్టించుకోని అధికారులు


డిజిటల్ అసిస్టెంటు గదిలో కుంగిన బండలు


సచివాలయం వెలుపల ఉన్న ర్యాంపు వద్ద పగిలిపోయిన టైల్స్

ఉయ్యాలవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనంలోని బండ పరుపు దెబ్బతింది. మూడేళ్ల క్రితం రూ. 40 లక్షల నిధులతో సచివాలయాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తి అయ్యి మూడేళ్లు పూర్తి అవ్వకముందే డిజిటల్ అసిస్టెంటు ఉండే గదిలో బండ పరుపు దెబ్బతింది. భూమి కుంగిపోయి. టైల్స్ పగిలిపోయి అడుగులోతు గుంతలు పడ్డాయి. అంతేకాకుండా సచివాలయం వెలుపల ఉన్న ర్యాప్‌కు ఏర్పాటు చేసిన టైల్స్ కూడా దెబ్బతిన్నాయి. భవంలోని గోడలకు అక్కడక్కడా చీలికలు పడ్డాయి. దీంతో డిజిటల్ అసిస్టెంటు గదికితాళం వేశారు. దీనిపై ఇంజనీరింగ్ అసిస్టెంటును వివరణ కోరగా కొత్త టైల్స్ తెప్పించామని, నిధులు రాగానే మరమ్మతులు చేస్తామని చెప్పారు.

'భౌ'.. భయం

● అధికమైన వీధి కుక్కల బెడద
● చిన్నారులపై దాడులు
● జిల్లాలో లక్షకు పైగా వీధి కుక్కలు?
● నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వేడుకోలు

కొలిమిగుండ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల బెడద రోజు రోజుకూ తీవ్రంగా మారుతోంది. వీధుల్లో శునకాల స్వైర విహారంతో ప్రజలు హడలి పోతున్నారు. ప్రతి రోజు జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో వీధి కుక్కల దాడిలో ప్రజలు గాయపడుతున్నారు. రెండు మాసాల క్రితం బేతంచర్ల పట్టణంలో వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందగా, తాజాగా బనగానపల్లె మండలం కైప గ్రామంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మరో చిన్నారిని వీధి కుక్కలు బలి తీసుకోవడం జిల్లాలో తీవ్ర కలకలంరేపుతోంది. వారం రోజుల క్రితం కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో కుక్క దాడిలో ఒకే రోజు 12మంది గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వీధి కుక్కల దాడులు రోజు రోజుకూ తీవ్రంగా మారుతుండటంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కుక్కలు వీధుల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మరోవైపు మేకలు, గొర్రెలు, పశువులపై దాడిచేసి చంపుతున్నాయి. దీంతో కాపరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కొలిమిగుండ్ల మండలంలో కుక్కల దాడిలో వందకుపైగా గొర్రె పిల్లలు మృతి చెందాయి. గతంలో వీధి


కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రె పిల్లలు(ఫైల్)


వీధులో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

కుక్కల నియంత్రణకు ప్రభుత్వాలు టీకాలు వేసేవారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. దీంతో వీధి కుక్కల సంతతి విచ్చల విడిగా పెరిగి లక్షలకు చేరింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సొసైటీలోని రైతులందరికీ సేవలందిస్తాం

● సొసైటీ నూతన చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్

బేతంచెర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సహకారాలతో ఆయా గ్రామాల రైతులందరికీ సహకార సంఘం సొసైటీల ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని సొసైటీ నూతన చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సహకార సంఘం సొసైటీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో చైర్మన్‌గా ఉన్నం చంద్రశేఖర్, డైరెక్టర్లుగా హనుమంతురెడ్డి, రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ కార్యదర్శి ఓబులేసు వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా బేతంచర్ల ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి కొత్తబస్టాండు, పాతబస్టాండు, అంగల్లబజారు మీదుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. సొసైటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. అనంతరం సొసైటీ కార్యాలయంలో వారు బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతుల సంక్షేమం కోసం నిబద్ధతగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో వర్ధన్‌రెడ్డి, న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి, ఎరుకుల చెరువు శివ, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు శ్రీనివాసరెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, షేక్షావలి చౌదరి, ఉన్నం సుధాకర్, విజయుడు, జావాజీ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ రామంజనేయులు, రామ్మూర్తి, రవీంద్ర నాయక్, మేకల నాగరాజు, రూబెన్, ఎండూరి మహేష్, యోగేంద్రబాబు, సంకలాపురం చంద్రశేఖర్, దస్తగిరి, సీతారామాపురం మాజీ సర్పంచ్ వెంకట్రాముడు, పిల్లి అశ్వత్, కొలుములపల్లె నాగరాజు, భీమేశ్వరరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉన్నం చంద్రశేఖర్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద మండల, పట్టణ ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, విజయ మోహన్ రెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, ప్యాపిలి శ్రీను, రామ్మోహన్ యాదవ్, డోన్ సహకార సంఘం సొసైటీ చైర్మన్ ఎల్లగౌడు, రాఘవేంద్రగౌడు, కొత్తకోట శ్రీను, మహ్మద్ రఫీ, మెట్టుపల్లె సుదర్శన్, ఎర్రగుంట్ల నారాయణ, జిలేబీ ధను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు టీడీపీతోనే సాధ్యం

బేతంచెర్ల: రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అందించడం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం బేతంచర్ల పట్టణంలోని 7, 8 వార్డులలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ఆయా వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఉయ్యాలవాడ: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉయ్యాలవాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమానికి తొలి అడుగు కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, కార్యకర్తలు ఉన్నారు.

మధ్యవర్తిత్వంతోనే కేసుల సత్వర పరిష్కారం





బనగానపల్లె, ఆళ్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారులు, న్యాయవాదులు

బనగానపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు వీలవుతుందని న్యాయాధికారి ప్రతిమ అన్నారు. బుధవారం పట్టణంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం - దేశం కోసం' అనే అంశంపై న్యాయవాదులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెట్రోల్‌బంకు కూడలిలో ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక నిర్మాణాత్మక ప్రక్రియ అన్నారు. బనగానపల్లె పరిధిలో నలుగురు ట్రైనర్లను నియమించామని, వారి ద్వారా వివిధ స్థాయిల్లో వివాదాలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా హుసేన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తి, బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

డోన్‌లో ర్యాలీ

డోన్ టౌన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వంతో పరిష్కారం వీలవుతుందని డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం భాస్కర్ నాయుడు అన్నారు. బుధవారం పట్టణంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ, డోన్ బార్ అసోసియేసన్ సంయుక్త ఆధ్వర్యంలో డోన్ సివిల్ కోర్టు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు 'మధ్యవర్తిత్వం - దేశం కోసం' అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నల్లమేకల మద్దయ్య, ఉపాధ్యక్షులు కేజీ చంద్ర శేఖర్, కోశాధికారి మంగమూరి శ్రీనివాసులు, నందిపల్లె నారాయణ, సీనియర్ న్యాయవాదులు టీఈ వేణుగోపాల్‌గౌడు, పుచ్చ కాయల శివరామకృష్ణ, క్రిష్ణమూర్తి, గుర్రం మనోహర్, పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో..

ఆళ్లగడ్డ: మధ్యవర్తిత్వం ద్వారా తగాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని న్యాయాధికారులు శైలజ, భాస్కర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కోర్టు నుంచి మూడు రోడ్ల కూడలి వరకు న్యాయ వాదులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామిరెడ్డి, ఏజీపీ బాలగురురెడ్డి, ఏపీపీ శివప్రసాద్‌రావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు


శిరివెళ్లలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లోని పలు చోట్ల వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలపై బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. కనీసం క్రయ, విక్రయాలు జరిపే రిజిస్టర్ సరిగా లేక పోవటంతో అసహనం వ్యక్తం చేశారు. డీలర్లు యూరియాను అధిక ధరకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి డీలర్ తప్పనిసరిగా ఎరువులు, పురుగుమందుకు సంబంధించి అనుమతి పత్రాలు, బిల్లులు సరి చూసుకోవాలన్నారు. రికార్డులు, బిల్లులు సక్రమంగా లేకపోతే ఎరువులు, పురుగు మందుల దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రికార్డులు సరిగ్గాలేని కొన్ని దుకాణాల్లో విక్రయాలను నిలుపుదల చేశారు.


రుద్రవరంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

డోన్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలలో రెండో విడత ప్రవేశం కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడువును పొడిగించారని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గణేశ్ ఉత్సవ కమిటీ సమావేశం

డోన్ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినాయక స్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో మొదటి సమావేశాన్ని నిర్వహించారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కార్య నిర్వహణ అధ్యక్షుడు సందు వెంకటరమణ, అధ్యక్షులు కోట్రికే ఫణిరాజ్, ప్రధాన కార్యదర్శి వై.హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులు ఆంజనేయులు గౌడు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరిస్తాం

● డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

డోన్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బూత్-100లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, కేహెచ్ఎస్ ఇన్‌చార్జి రమేష్, చంద్రపల్లి సందీప్, వార్డు సభ్యులు నాయుడు పాల్గొన్నారు.

సీఎస్సీ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆయా కమ్యూనిటీల్లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్ అన్నారు. బుధవారం ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో పర్యటించి నిర్మాణాలను డీఈ పరిశీలించారు. ఆయన వెంట ఏఈ ప్రణీత్‌క్రిష్ణ ఉన్నారు.

పిల్లలను బడికి పంపాలి

ఉయ్యాలవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పిల్లలను బడులకు పంపించాల్సి బాధ్యత తల్లిదండ్రులదేనని ఎంఈవో- 1 రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం కొండపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రెగ్యులర్, స్పెషల్ పాఠశాలల్లో కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారన్నారు. దీని వల్ల పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. దీని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటుకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ఆయన కోరారు.

ప్రజారోగ్యమే ధ్యేయం

చాగలమర్రి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ప్రోగ్రామ్ మానిటరింగ్ అధికారి అంకిరెడ్డి తెలి పారు. బుధవారం మండలంలోని మద్దూరు, చాగలమర్రి గ్రామంలోని మూడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, అంజలి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు విష్ణుప్రియ, మాబుహుసేన్, ఏఎన్ఎంలు నర్సమ్మ, వసంత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే పీ-4 లక్ష్యం

చాగలమర్రి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరుపేదల అభివృద్ధే పీ-4 లక్ష్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద పీ-4 గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ధ్యేయమన్నారు. చాగలమర్రి మేజర్ పంచాయతీలో 6,445 కుటుంబాలు ఉండగా 460 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించారని అన్నారు. వీటిలో 420 గృహాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యా, వైద్యంతో పాటు అన్ని రకాల సేవలు అందిస్తామని అన్నారు. సమావేశంలో సర్పంచ్ తులశమ్మ, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, పంచాయతీ ఈవో తారకేశ్వరి, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామ సభలు ప్రారంభం

కొలిమిగుండ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో పీ-4 గ్రామ సభలు ప్రారంభం అయినట్లు ఎంపీడీవో ప్రసాద్ రెడ్డి బుధవారం వెల్లడించారు. నేడు బెలుం, అంకిరెడ్డిపల్లె, బి.ఉప్పలూరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న తిమ్మనాయినిపేట, తోళ్లమడుగు, కనకాద్రిపల్లె, 19న నందిపాడు, కొలిమిగుండ్ల, 22న పేట్నీకోట గొర్విమానుపల్లె గ్రామాల్లో పీ-4 గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

సంజామల మండలంలో..

సంజామల: మండలంలోని ఆకుమళ్ల, ముక్కమళ్ల గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో సాల్మన్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 762 బంగారు కుటుంబాలను 621మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారన్నారు. ఆకుమళ్లలో 110 కుటుంబాలను 107 మంది దత్తత తీసుకున్నారన్నారు. వీరికి అనుసంధానంగా ఉండి కనీస వసతులు కల్పిస్తూ సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేలా మార్గదర్శకులు తోడ్పాటును అందించాలన్నారు. కార్యక్రమంలో మార్గదర్శకులు టీడీపీ నాయకులు పుల్లారెడ్డి, తిమ్మయ్య, హుసేని, రామగోవింద రెడ్డి, యూనిస్ బాష, మార్గదర్శకులు , కార్యదర్శి నాగలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మేజర్ పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈవో తారకేశ్వరి తెలిపారు. బుధవారం చాగలమర్రి పంచాయతీ ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక సంఘ నిధులు, పంచాయతీ నిధులతో గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పంటల బీమా తప్పనిసరి

చాగలమర్రి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని ఏఈవో మంజుల సూచించారు. బుధవారం 3వ రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పరిహారం పొందవచ్చని అన్నారు. కౌలు కార్డు ఉంటే కౌలు రైతులు కూడా అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులని అన్నారు. సమావేశంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

చాగలమర్రి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నూతన ఎన్నికల నిబంధనలు, యాప్‌పై బీఎల్‌వోలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నిబంధనలపై అన్నదాత సుఖీభవ, తల్లికి వందనంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

రుద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ అన్నారు. బుధవారం రుద్రవరం ఆదర్శ పాఠశాలలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత దేశానికి దిక్సూచి అన్నారు. ఐటీ, అగ్రికల్చర్, వృత్తి నైపుణ్య కోర్సుల వల కలిగే అవకాశాల గురించి వివరించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగ కాల్వలో కృష్ణాజలాలు

రుద్రవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ ప్రధాన కాల్వలో క్రిష్ణమ్మ బిరాబిరా అంటూ పరుగులు తీస్తోంది. బుధవారం రుద్రవరానికి క్రిష్ణాజలాలు చేరాయి. ఈ సందర్భంగా ఏఈ రామశేషు మాట్లాడుతూ వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి 3500 క్యూసెక్కులు నీటిని తెలుగుగంగ ప్రధాన కాల్వకు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట కంపచెట్లను తొలగిస్తున్నట్లు ఏఈ రామశేషు తెలిపారు. అధికారులు, రైతులు కాల్వ వెంట రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

ఉప్పలూరులో తాగునీటి సమస్య

కొలిమిగుండ్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయల ఉప్పలూరు గ్రామంలో తాగు నీటి సమస్య ఏర్పడింది. పంచాయతీ బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు సమస్యను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి బీసీ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం అధికారులు ట్యాంకర్లు ఏర్పాటుచేసి నీటి సరఫరా ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పండ్ల తోటల సాగుపై శ్రద్ధ చూపాలి

కోవెలకుంట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండ్ల తోటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపి అధిక లాభాలు పొందాలని ఉపాధి హామీ పథకం పీడీ సూర్యనారాయణరావు సూచించారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలోని సంజామల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాలకు చెందిన ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రైతులు పండ్లతోటల సాగుపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఏపీడీ సాంబశివారెడ్డి, ఏపీవోలు శ్రీకళ, జయంతి నిర్మల, గౌరీబాయ్, హరిక్రిష్ణ, వెంకటరమణ పాల్గొన్నారు.